# వెన్నెల

''జాగ్రత్తగా వెళ్ళిరండి'' అంటోంది శ్రీమతి.

రమణమూర్తి చాల తొందర్లో వున్నాడు. రెండు రోజుల్లో మద్రాసులో సైన్స్ కాన్ఫరెన్స్ జరుగుతుంది. దానికి తను హాజరుకావాలి. అక్కడతను 'న్యూక్లియర్ ఫిజిక్స్'లో తన పేపరుకూడా చదవాలి.

బెజవాడ లైనులో రైలు డీరైలుమెంటు వల్ల అటువెళ్ళే రైలుబండ్లన్నీ కాన్సిలు అయ్యాయి. యివ్వాళ, రేపటి మద్రాసు ప్లైటుకు టిక్కెట్లన్నీ బుక్కయినాయి. తను రైలులో ప్రయాణం చేద్దామనే ఉద్దేశ్యంతో ముందు జాగ్రత్తపడలేదు. ఇక మద్రాసుకు, విజయవాడదాకా ఏ బస్సులోనయినా వెళ్ళి, అక్కడ ఏదయినా ట్రైన్ కాచ్ చెయ్యాలి.

'లెస్‌లగేజ్ మోర్ కంఫర్ట్.' రమణమూర్తి అన్న మద్రాసులోనే వున్నాడు. అందువల్ల బెడ్డింగ్ వగైరా బరువు సామానులన్నీ వదిలేసి చిన్న సూట్‌కేస్ తీసుకుని బయలుదేరాడు.

''నాన్నా! నాకు కేరంబోర్డు తీసుకరావటం మర్చిపోకండి'' అంది పెద్దకూతురు సుజాత.

''ఇక్కడ కొనుక్కోవచ్చులే అమ్మా! దాన్ని అంత దూరం నుండి ఏం మోసుకవస్తాను'' అన్నాడు రమణమూర్తి, తన పరిశోధనకు సంబంధించిన పేపర్లూ అవీ సర్దుకుంటూ.

''ఊహుం అక్కడ్నించే మంచిది పట్టుకురావాలి'' అన్నది గారాలుపోతూ.

సుజాత తరవాతి వాడు తల్లికేదో చెప్తున్నాడు.

రమణమూర్తి తన ముగ్గురి పిల్లలకు కావాల్సినవి తెస్తానని చెప్పి సూట్‌కేసు పట్టుకుని బయలుదేరాడు.

గౌలిగూడ బస్‌డిపో కొచ్చేటప్పటికి సాయంత్రం ఐదున్నర గంటలయింది. వాలిపోతున్న సూర్యుడు, మూసీనది ప్రహరీ రాతికట్టడాలమీద ప్రకాశిస్తున్నాడు.

విజయవాడ బస్సుకు పెద్ద క్యూ వుంది. కనుక్కుంటే ఎనిమిది గంటలకు కాని బస్సు లేదన్నారు. వరసగా రెండు మూడు సెలవులు వచ్చినట్లున్నాయి. పైగా రైలుబండ్లు కూడా ఆగిపోవటంతో, బస్సు క్యూ చాలా రష్‌గా వుంది. ఈ క్యూలో నిలబడితే తను రాత్రి పదిగంటలకయినా బయటకు వస్తాడా అన్పించింది రమణమూర్తికి. 'లేడీస్ క్యూ' చిన్నది కాకపోయినా మొగవాళ్ళ క్యూకంటే చిన్నదిగానే వుంది.

ఏ మహిళనయినా ఓ టిక్కెట్టు తీసుకోమని రిక్వెస్టు చేద్దామని అటువైపు వెళ్ళాడు. చివర్లో ఆమె - పాతిక ఏళ్ళుంటాయేమో తెల్లచీరె తెల్ల జాకెట్టు సన్నగా పొడుగ్గా వుంది. స్ఫుటంగా కన్పించే ముక్కు. నవ్వే కళ్ళు, పై పెదవికి ఎడమవైపు నల్లమచ్చ, చెవులకు రింగులు, మెళ్ళో సన్నని గొలుసు - బహుశః మంగళసూత్రమేమో ననుకున్నాడు రమణమూర్తి. అతను అడగ్గానే ఆమె ఒప్పుకున్నది.

కాలం భారంగా నడుస్తున్నది. కాలంతోపాటు మనుషులు జమకూడుతున్నారు క్యూల్లో. సిగరెట్టు ముట్టించుకున్నాడు రమణమూర్తి. ఓ క్షణం బుక్‌స్టాల్‌వైపు నడిచాడు. ఓ పుస్తకం చేతిలోకి తీసుకుని పేజీలు తిప్పి అక్కడపెట్టాడు. షాపు కుర్రాడు ''యిది చూడండి సార్'' అంటూ 'లారెన్స్' నవలొకటి చేతిలో పెట్టాడు. అదీ పేజీలు తిప్పి అక్కడ పెట్టి పరికిస్తుంటే మరోటి తెచ్చాడతను. అయ్యేకేదో పుస్తకం అమ్మేద్దామనే ఉద్దేశ్యంలో వున్నాడు. రమణమూర్తి వాడి పద్ధతిచూసి, తనెలాగో కొనే ఉద్దేశ్యంలో లేడు. వాడికి తన మీది కుతూహలాన్ని యింకా రెచ్చగొట్టటం యిష్టంలేక వెంటనే బయటకువచ్చాడు.

ఏవోవో బస్సులు వస్తున్నాయి. పోతున్నాయి. తనెప్పటికి కదుల్తాడో.

టాక్సీవాడూ, ఓ పెద్దమనిషి పోట్లాడుకుంటున్నారు. మీటర్‌చార్జీమీద మూడు రూపాయలు ఎక్కువ యిమ్మంటున్నాడు టాక్సీ అతను. ఆ పెద్ద మనిషి మీటర్ చార్జీనే యిస్తానంటున్నాడు. ఈ జంటనగరాల్లో యిదో పెద్ద న్యూసెన్సయి పోయింది. బొంబాయి, మద్రాసులాంటి మహానగరాల్లోనయితే రైల్వేస్టేషన్లో బండిదిగుతూనే టాక్సీస్టాండుకొచ్చి పోనివ్వమనటమే. అక్కడ అలా టాక్సీలు క్యూలో వుంటాయి. నవాబులు పరిపాలించిన ఈ నగరంలోమాత్రం, తామూ నవాబులమే అని ప్రవర్తించేతత్వం జనసామాన్యంలో యింకిపోయింది. యిక్కడ టాక్సీ మాట్లాడుకునే ముందే తానెక్కడకు వెళ్ళాల్సిందీ వగైరా అన్నీ చెప్పాల్సిందే. అదీ ఆ డ్రయివరు మహాశయుడు నీమీద కరుణించెనా, సరేనంటాడు. లేదూ నీవుండే బస్తీ దూరంగా వుండేటట్లయితే 'రిటరన్‌ఫేర్' కూడా యిమ్మంటాడు. లేకపోతే ''మీటర్‌చార్జి మీద ఎంతిస్తావ్'' అంటాడు. యిక పోలీసు డిపార్ట్‌మెంటు వుంది కదయ్యా అంటారూ - టాక్సీ డ్రయివర్లూ, వాళ్ళూ అన్యోన్య స్నేహితులు, స్నేహితుడిమీద ఈగ వాలనివ్వటం మన భారతీయ తత్వంలోనే లేదు.

''ఆప్ బోలోసాబ్. సనత్‌నగర్ సే నికల్‌తే వఖత్ హీ బోలాథా యిన్‌సే తీన్ రూప్యాబఢ్‌కే దేనా బోల్కే....''

రమణమూర్తి ఏం చెప్తాడు. ఆ ప్రయాణికుడి పక్షం వహిద్దామంటే అతన్తో కలిపి తన్ను కూడా తిట్టేట్టున్నాడు టాక్సీవాడు. ఏం మాట్లాడకుండా వెళ్ళి మూసీ నది ఒడ్డు రాతి కట్టడపు ప్రహరీమీద కూర్చున్నాడు.

వీధి దీపాలు వెలిగాయి. చీకట్లు పరచుకుంటున్నాయి. వివేకవర్ధని స్కూలు బిల్డింగులమీదుగా లేస్తున్నాడు పూర్ణచంద్రుడు.

జనం గూళ్ళకు చేరుకుంటున్నారు.

రమణమూర్తి 'బుకింగ్ ఆఫీసు' దగ్గరకు తిరిగి వచ్చాడు. నాల్గోనంబరు కౌంటరు దగ్గర చలనం మొదలయింది. ఆడవాళ్ళ క్యూ కూడా పొడుగ్గా వుంది. ఆమెకు టిక్కెట్టు అందేటప్పటికి యింకా అరగంటయినా పడుతుందేమో అనుకున్నాడు రమణమూర్తి. ఓ క్షణం వెళ్ళి క్యూ పక్కన ఆమె దగ్గరగా నిలబడ్డాడు. ఆమె నీరసంగా నవ్వింది.

''ఎన్ని యుగాలకు బయటపడతామో'' అన్నది.

రమణమూర్తికి ఏం మాట్లాడాలో తోచలేదు. బుకింగ్ ఆఫీసు వరండాలో వెన్నెల కురుస్తుంటే వచ్చి నిలబడ్డాడు. చంద్రుడిలో మచ్చ చూస్తుంటే ఆమె పెదవి మీద మచ్చ గుర్తుకొస్తోంది.

విజ్ఞానాభివృద్ధితో, తార్కిక శక్తియొక్క విశృంఖలత్వం మానవుడి మెదడులో ఏవో సున్నితతంత్రుల్ని తెంపినట్లనిపించిందతనికి. మెదడు పెరుగుతూంటే మనసు చచ్చిపోతోంది. గుండెకాయ ప్రతికంపనకీ, హృదయంలో స్పందించే గుణం అంతరించిపోతోంది.

చంద్రుడిలో ఆ నల్లమచ్చ 'కుందేలు'అని ఊహించే - రెక్కలు విచ్చుకుని ఎగిరే విహంగం లాంటి మనస్సు - అదే పర్వతమోనన్న పచ్చి నిజాన్ని తెలుసుకుని, ఆ శిలా కర్కశత్వానికి శిరస్సు తాటించుకుని చచ్చిపోతోంది. మానవుడు చంద్రుడిలో అడుగుపెట్టి సాధించిన ఘనత ఏమిటి? మానవత్వంలో మరో అడుగు ముందుకు వేశాడా? వస్తు సంచయమూ, భౌతికాభివృద్ధేనా నాగరికతకు ప్రమాణాలు? మనం ఎక్కడకు పోతున్నాం?

సుమారు ఏడున్నరయి వుంటుంది సమయం. విజయవాడ వెళ్ళేబస్సు ప్లాట్‌ఫారం మీద నిలబడింది. టిక్కెట్టు తీసుకున్న జనం యుద్ధంలో విజయం సాధించిన సైనికుల్లా తిరిగి వస్తున్నారు. తనూ బుకింగ్ ఆఫీసులోపలికెళ్ళాడు రమణమూర్తి.

ఆమెకు ముందు యింకా యిద్దరు ముగ్గురు స్త్రీలున్నారు క్యూ మెల్లగా కదులుతోంది. 'ఆ పిల్ల సహాయం లేకపోతే తనివ్వాళ టిక్కెట్టు తీసుకోగలిగేవాడా' అనుకున్నాడు రమణమూర్తి. ఆమె వంతు వచ్చింది. రమణమూర్తి కొంచెం ప్రక్కగా నిలబడ్డాడు. డబ్బిచ్చి విజయవాడకు రెండుటిక్కెట్లు తీసుకుందామె. బుక్కింగ్‌క్లర్క్ యింకా చిల్లర యివ్వలేదు.

''చిల్లర తీసుకోండి'' అంటోంది ఆమె - అంతే యింకేం మాట్లాడలేదు - మనిషి క్రిందకు పడిపోతున్నది. 'ఏమిటా' అని అర్థం కాక చూస్తున్నాడు రమణమూర్తి.

''అయ్యో అట్లా చూస్తూ నిలబడ్డారేం... ఆ పిల్ల అలా స్పృహతప్పి పడిపోతూంటే...'' క్యూలో నిలబడ్డ ఓ నడివయసు ఆడమనిషి రమణమూర్తిని గద్దిస్తోంది.

క్యూ ముందు భాగం కొంచెం చిందర వందరయింది. ముందు క్యూలో నిలబడ్డవాళ్ళు ఆమెని పట్టుకున్నారు. రమణమూర్తికి అప్పుడు తోచింది. అయితే ఆమె పరాయి స్త్రీ, ఆమె కెలా సహాయం చేయాలో తోచలేదు.

''అలా ఒళ్ళో తల పెట్టుకుక్కూర్చోండి. కొంచెం నీళ్ళు పట్టుకొస్తాను'' అని ఓ ఆప్తబాంధవుడు ఆదుర్దాగా బయటకు పరిగెత్తాడు.

తనను వీళ్ళంతా ఏమనుకుంటున్నారు. ఆమెకూ, తనకూ ఏమీ సంబంధం లేదని ఓ క్షణం అరవాలనిపించింది. అయితే ఎవరూ నమ్మేట్టు లేరు. చేసేదిలేక అంటే అంటనట్టు ఆమె తల ఒళ్ళో పెట్టుకుని నేల మీద కుర్చున్నాడు. ఆపద్బాంధవుడు తెచ్చిన నీళ్ళు ఆమె ముఖాన చిలకరించాడు. కొంచెం సేపటికి ఆమెలో చలనం కన్పించింది, కళ్ళు తెరిచింది.

''ఎట్లావుంది'' అడిగాడు రమణమూర్తి.

నీరసంగా వున్నట్లుంది, మాట్లాడే స్థితిలో లేదామె.

మెల్లగా లేపి కాఫీ తెప్పించి త్రాగించాడు.

ఆమె కొంచెం స్పృహలోకి రావడం చూసిన జనం, మళ్ళీ వాళ్ళ ధోరణిలో పడ్డారు.

''నడవగలరా?'' అడిగాడు రమణమూర్తి.

ఆమె తల ఊపింది.

ఆమెని లేపి పొదివి పట్టుకుని బస్సుదాకా నడిపించాడు. ఆమె పరిస్థితిని అప్పటిదాకా వీక్షించిన జనం, పోటీలేకుండా, వాళ్ళిద్దరికీ వేరేగా కిటికీ వైపున్న రెండు సీట్లిచ్చి, మానవతా యజ్ఞంలో తామూ ఓ సమిధ చేర్చినట్లు సంతోషించారు.

మూడు నాలుగు గంటలు నిలబడటంతో మనిషి ఫైంటు అయినట్లుంది. గాలికి తేరుకుంటుందని ఆమెని కిటికీ పక్కగా కూర్చోపెట్టాడు రమణమూర్తి. టిక్కెట్టుకుపోగా మిగిలిన చిల్లర, ఆమె సంచీ, రమణమూర్తి సూట్‌కేసూ ప్రయాణీక బంధుకోటి బస్సులోకి చేర్చింది.

''ఏమయినా తింటారా?''... అడిగాడు రమణమూర్తి.

ఏమీ వద్దన్నట్టు సైగచేసి, బస్సు కిటికీకి తల వాల్చి నీరసంగా పడుకున్నదామె.

బస్సు కదిలింది. మూసీని చుట్టి, చాదర్‌ఘాట్ పూల్‌మీదుగా మలక్‌పేట వైపు దూసుకుపోతోంది బస్సు, సలీమ్‌నగర్ కాలనీ, దిల్‌షుఖ్‌నగర్, మానవ నివేశన స్థలాల్నిదాటి విజయవాడ రోడ్డుపట్టింది. బస్సు కుదుపులకు తల కిటికీకి కొట్టుకున్నట్టుంటే, తల సీటుపై కుషన్‌మీద నిలుపు కోవాలని విఫల ప్రయత్నం చేసి, రమణమూర్తి భుజంమీద తలవాల్చిందామె.

ఆమె స్పర్శకు అతని శరీర జీవకణాల్లో ఏదో ఉత్తేజం కలుగుతోంది. ముగ్గురు బిడ్డల తండ్రి

తను - స్త్రీ స్పర్శ తనకు కొత్తేంకాదు, ఏడేళ్ళ వైవాహిక అనుబంధం వుంది. వయస్సు మూడో పది దాటింది. ఇప్పుడు తన మనస్సుకు ఈ పెడదారేమిటి? - అందులో ఆమెవున్న విపత్కర పరిస్థితిలో.

మనస్సుకు తగిలించిన పగ్గాల్ని, నిపుణుడైన సారథిలా పట్టుకు కూర్చున్నాడు.

ఆమె అలానూ ఎక్కువ సేపు కూర్చోలేక పోయింది. అతని ఒడిలో వాలిపోయింది. రాత్రిళ్ళు బస్సులో ప్రయాణం చేసే ప్రయాణీకులకు ఆ దృశ్యాలేం క్రొత్తగావు. రాత్రి ముందుకొస్తున్నకొద్దీ. వయసుభార్య తమకంతో భర్తఒళ్ళో వాలటం, భర్త ఆమె వీపు మీద ఒరగటం - అది నిద్ర, కొత్త ప్రదేశంలో అనలుపెట్టే కోరికో-

ఆమె మెళ్ళో వున్న సన్నగొలుసుకు, చివర హృదయాకారంలో చిన్న లాకెట్ వ్రేలాడుతోంది. ఆమె వివాహితో, అవివాహితో అర్థం కాలేదు, రమణమూర్తికి. వివాహిత స్త్రీకి వుండే తాళిబొట్టుకాని, కాళ్ళకు మట్టెలుకాని ఏంలేవు. అవివాహితే అని నిర్ధారించుకున్నాడు రమణమూర్తి.

ఈ ఆలోచనా - ఆమె ఒళ్ళూ, వయసూ అతని శరీరంలో అణువణువునీ రగిలిస్తోంది. బయట వెన్నెల కిటికీలో గుండా వచ్చి ఆమె మీద పడుతోంది. వెన్నెలంత తెల్లగా వున్నది ఆమె చీరా జాకెట్టూ. వెన్నెలంత మృదువుగానూ వుంది ఆమె శరీరం - వెన్నెల రేకెత్తించే కోరికలను తీర్చే వెచ్చదనమూ వుంది, అంత అమాయకత్వమూ వుంది. ఓ వెలుగు కిరణం ఆమె దుద్దుల రాళ్ళలో ప్రతిఫలించింది. ఎవరీమె? శశికళా...? యిది శశియొక్క ఒక్క కళకాదు. పూర్ణచంద్రిక... వెన్నెల.

అతని ఒళ్ళో వెన్నెల విరగకాస్తోంది.

ఆమె వీపుమీద చేయి వేశాడు. అంత స్వచ్ఛమైన వెన్నెల్లో, అతని చెయ్యి నల్లగా, కాలమేఘంలా ఉంది.

ఆమె వున్న ఈ స్థితిలో ఈ అన్యాయాక్రమణకూ, తన దౌర్బల్యానికీ అతనికి దిగులనిపించింది. తన మనస్సు యింత చంచలమని అతనికెప్పుడూ అనుభవంలోకి రాలేదు. స్త్రీకి దూరంగా వుండి నిగ్రహం కనబరచాననే డాంబికంకంటే, ఆమె సమక్షంలో నిగ్రహం చూపించినవాడే మొనగాడు అనుకున్నాడు ఓ క్షణం రమణమూర్తి.

కాళ్ళూ చేతులూ కట్టేసుకున్నా ఆరాయి మీద వెన్నెల వింతగా మెరుస్తోంది. వెన్నెలకు చంద్రకాంత శిలలు కరుగుతాయట.

బస్సు నార్కెట్‌పల్లి ప్రాంతానికి వస్తూండగా కాబోలు ఆమె కొంచెం తేరుకొని లేచి కూర్చుంది. ఇంకా పూర్తిగా కోలుకోలేదు.

''ఏమయినా తింటారా?'' మళ్ళీ అడిగాడు. రమణమూర్తి.

''తీసుకురండి'' ధవళధూసరితమైన శశిలా పేలవంగా నవ్వింధామె.

అక్కడేం దొరుకుతాయి. టీస్టాల్లో రెండు 'చాయ్'లకు ఆర్డరిచ్చి, నానురొట్టె పట్టుకొని బస్సులోకి వచ్చాడు.

''మీ ఆయనెక్కడికి వెళ్ళాడమ్మా?'' గౌలిగూడ బస్సు డిపోలో ఈమెని పరిశీలించిన నడివయస్సు ఆడమనిషి వెనక సీట్లో నుండి ప్రశ్నిస్తోంది.

తేరుకుని జవాబివ్వటానికి ఓ క్షణం పట్టిందామెకు.

''బయటకు వెళ్ళారు.''

''అదేమిటమ్మా. అంటే ముట్టనట్టుంటాడు. నీ ఒళ్ళు తెలియనప్పుడు చూశాను ఆయన పరిస్థితి. తనకేం పట్టనట్టు, సంబంధించనట్టు ప్రవర్తించాడనుకో... ఈ కాలం వాళ్ళకు అది సిగ్గో, మరేమిటో నాకుమాత్రం అర్థంకావటం లేదు తల్లీ'' అంటోంది తన్ను వెనకతరానికి జరుపుకుంటూ.

రమణమూర్తి రావటం చూసికూడా ఆవిడ తన వ్యాఖ్యానం ఆపుచెయ్యలేదు. ఇట్లాంటి గొట్టికాయల్ని ఆవిడేం లెక్కపెట్టదు. న్యాయం కోసం, ధర్మం కోసం పోరాడమని ఉద్బోధించే ఉపన్యాసకర్త ముఖవిన్యాసాలకీ, ఆవిడ ముఖ లక్షణాలకీ ఏమాత్రం భేదం లేదు.

చాయ్ త్రాగి కప్పులు వాపసిచ్చేశారు. మళ్ళీ బస్సు బయల్దేరింది. 'బ్రెడ్'లో ఒక్కొక్క 'స్లైస్' విడదీసి యిస్తున్నాడు. ఆమె తింటోంది. అప్పటికి ఆమె కొంచెం తేరుకుంది.

''పాపం చాల కష్టపడుతున్నారు'' అన్నది వెన్నెల్లో తడిసిన ఆపాలరాతి బొమ్మ, చిన్నగా నవ్వుతూ. ఆమె మాటల్లో వున్నది కృతజ్ఞతో, సేవల్నందుకునే రాకుమారి లాంఛన ప్రాయమైన మాటల రాజసమో... లేక హేళనో....

''కాదామరి'' అన్నాడు రమణమూర్తి అదే టోన్‌లో.

''ఆ ప్రవరాఖ్యుడి తురువాత మీకే యిలాంటి ఛాన్సు దొరికింది'' అన్నది వెన్నెల. తాము కల్పించిన సిగ్గుపడే పరిస్థితుల్లో నుండి బయటకు వచ్చే ప్రయత్నంలో అవివేకంతో కొన్ని కొన్ని పొరపాట్లు చేస్తారు ఆడవాళ్ళు. ''అయితే మీరు కొంచెం జాగ్రత్తపడాలి. నేను ప్రవరాఖ్యుణ్ణికాదు'' అన్నాడు రమణమూర్తి.

''మీకా భయమేం అక్కరలేదు. మేం నవీన కాలపు వరూధినులం. మీ 'మేల్‌కింగ్‌డమ్' నంతా 'క్లాసిఫై'చేసి 'ఇన్‌వర్టిబ్రేట్స్' 'వర్టిబ్రేట్స్'గా విడదీశాం. వెన్నెముక లేని జంతువుల నుండి మాకేం ప్రమాదంలేదు వెన్నెముకున్న వాటిని మా ఆలోచనా తటిల్లలతో బందీలుగా వుంచుతాం.'' జూవాలజీ గ్రాడ్యుయేటు అయ్యుండాలి ఈ వెన్నెల పిల్ల అనుకున్నాడు రమణ మూర్తి.

ఆవిడ ధోరణి వింతగా అన్పించిందతనికి.

వెన్నెల కురుస్తోంది, ఆమె చెప్తోంది.

''ఫైలమ్ ప్రొటాజువాకి చెందిన మా క్లాస్‌మేటు ఒకడుండేవాడు. అతడి 'సూడో పోడియా' అంటే 'ఫాల్స్‌ఫీట్' - సింపుల్‌గా మారువేషాలనుకోండి - మచ్చుకు కొన్ని చెప్తాను. మా స్నేహితురాలు మాలతికి ప్రేమ లేఖ వ్రాస్తూ 'మహా ప్రేమికు'డయ్యాడు! అది రాజుని ప్రేమిస్తే వాళ్ళ ప్రేమకు 'విలన'య్యాడు. వాళ్ళ పెళ్ళి తర్వాత 'భగ్నప్రేమికు'డయ్యాడు ఆ తరువాత 'మాలతీ! నీ సుఖమే నా సుఖం' అని అమర ప్రేమికుడయ్యాడు ఆ భగ్న ప్రేమలో హృదయం పోగొట్టుకొని మిలిటరీలో చేరి 'దేశభక్తు'డయ్యాడు అలా అంచలంచలుగా...''

''తల్లీ నమస్కారం... నేనో 'ఆక్టోపస్'లో చిక్కుకున్నానురా బాబూ.'' అన్నాడు రమణమూర్తి.

''ఆక్టోపస్ కాదు. దీన్ని 'లైఫ్‌ఫోర్స్' అన్నాడు బెర్నార్డ్‌షా.''

''అయితే నేనెక్కడకు పారిపోవాలని? నాకు వేరే దారి వున్నట్టులేదు'' హేళనగా రెచ్చగొట్టుతున్నట్లన్నాడు రమణమూర్తి.

''యిందాక వెనకావిడ మీ ఆయనేం పట్టనట్టుంటాడేం అని రిమార్క్ చేస్తోంది.''

''ఆవిడకేం తెల్సు నేను సాలెగూడులో చిక్కుకున్నానని.''

''ఎంత దాకానో ప్రయాణం.''

''మద్రాసు''

''ఏం పనో''

''సైన్స్ కాన్ఫరెన్స్'లో పాల్గొనేందుకు''.

''నాకూ అలాంటివి చూడాలని చాలాకాలం నుంచీ వుంది, నేనూ వచ్చేదా.''

''పెళ్ళికి వెళ్తూ పిల్లిని చంకనపెట్టుకు వెళ్ళినట్టు.''

వెన్నెల కిలకిలా నవ్వింది.

''ఏఁవిటది కాస్తంత మెల్లగా.''

''మా రాజ్యవిస్తీర్ణాన్ని విస్తృతపరచుకొనేందుకు ఓ చిన్న రాజకీయపుటెత్తు.''

''మేం 'సీజ్ ఫైర్'కు అభ్యర్థనం పంపుకున్నాం.''

''ఆలోచిస్తాం.''

వెన్నెల నవ్వింది. పాలరాయి కొద్దికొద్దిగా కరుగుతోంది.

బస్సు 'సూర్యాపేట'లో ఆగింది.

''కాఫీ గట్రా ఏమైనా దొరుకుతుందేమో చూడండి.''

కథా నిలయం
3615
శ్రీకాకుళం

రమణమూర్తి బస్సుదిగి సిగరెట్టు వెలిగించుకున్నాడు. కాఫీ తయారు చేయాలంటే కాస్త ఆగాలన్నాడు హోటల్‌బాయ్.

''కాఫీకి ఆలస్యం వుంది. చాయ్ తాగుతారా?'' అడిగాడు బస్సుకింద కిటికీ దగ్గరగా వచ్చి.

''ఆ చాయ్ తాగితాగి డోకొచ్చేటట్టుంది. రెండు నిమిషాలు ఆలస్యమయినా ఫరవాలేదు, కాఫీ పట్రండి.''

మళ్ళీ బస్సు కదిలింది. ఆత్రంగా పరిగెడుతోంది.

కాలం గడుస్తున్నకొద్దీ బస్సు వేగానికి వచ్చేగాలి, ఒంట్లోచలి పుట్టిస్తున్నది. సిగరెట్టు తాగాలనిపించింది రమణమూర్తికి, క్షణం సందేహించాడు.

''ఫరవాలేదు తాగండి'' తీసిన సిగరెట్టుపెట్టి మళ్ళీ ప్యాంటు జేబులోకి తోస్తూంటే అన్నది వెన్నెల.

చలికి ముడుచుకు కూర్చుంది వెన్నెల.

తన ఓవర్‌కోటు తీసిచ్చాడు రమణమూర్తి.

''కప్పుకోండి'' ఆమె ఏం అభ్యంతరం చెప్పలేదు.

రమణమూర్తి ఆలోచనలో పడ్డాడు. భవిష్యదాకాశంలో రంగుల యింద్రధనుస్సు విరుచుకుంటోంది.

''వెన్నెలా'' అన్నాడు మత్తుగా రమణమూర్తి ఆమె విన్నట్టులేదు. అలాగే నిశ్చలంగా కూర్చుంది.

బస్సు కుదుపులకు ఆమె ఒళ్ళు అతనికి స్వేచ్ఛగా తగులుతోంది. బస్సు విజయవాడ చేరకుండా వెనక్కి తిరిగిపోతే ఎంత బావుండును అనుకున్నాడు. పోనీ ఇంతవేగంలో ఏచెట్టుకయినా గుద్దుకుని ఆగిపోతే...

''బస్సు సలక్షణంగా చేరుతుంది విజయవాడ'' అంటోంది వెన్నెల. క్షణం ఉలిక్కిపడ్డాడు రమణమూర్తి.

''నాకు నిద్రవస్తోంది'' అన్నాడు.

''అయినా ప్రపంచం ఆగదు. బస్సు నడుస్తూనే వుంటుంది.''

''మన మిద్దరం ఒకటే ఆలోచిస్తున్నాం.'' అన్నాడు రాజీధోరణిలో రమణమూర్తి.

''మీరు ఒకటే ఆలోచిస్తున్నారు. నేను మిగతావికూడా ఆలోచిస్తున్నాను.''

''అవును ఆడవాళ్ళు చాలా ప్రాక్టికల్ మనషులట.''

కోదాడ్ దాటిపోతోంది బస్సు.

''మనిషి తన్ను చూసుకోవటంతో ప్రపంచాన్ని చూడటం మొదలెడతాడట'' వెన్నెల సూటిగా

కిటికీలో నుండి పడటం లేదు. ఆమె ఒళ్ళో తెల్లని చీరె మీద ఆడుకుంటోంది. దూరంగా ఏదో పల్లె దాటిపోతోంది. ఊరుమట్టూ చెట్టూ చేమ...

''అలాంటి పల్లెటూళ్లో అనామకంగా గడిపేస్తే బావుండు'' అన్నాడు రమణమూర్తి.

''నాలుగురోజుల ఆనందసౌధానికీ, ఆ తరవాత కూలిపోయే ఆనంద హర్మ్యానికీ ఏకత్వం ఎక్కడో?''

''యిక్కడే. ఈ జీవితం ఓ 'యివల్యూషన్' అవసరమైనవి పరిగ్రహించి, అనవసరమైనవి పరిత్యజించి జీవితం ముందుకు సాగుతుంది. ఉన్నవి పోయేటప్పుడు ఆక్రోశం, కొత్తవి వచ్చేటప్పుడు ఆనందం, ఉత్సాహం - మానవుడు ఎప్పుడూ రాజీపడక తప్పదు.''

''అప్పుడే మనం చరమగీతి పాడేస్తున్నాం'' అన్నాడు రమణమూర్తి.

''లేదు, యివ్వాల్టి మన ఈ పరిచయానికి యిదే నాందిగా ముందుకడుగేద్దాం.''

''యింక అక్కడేం మిగిలింది?''

''అనుభూతి''

''అదేనా చివరకు మిగిలేది?''

''అదిచాలు. మనం మానవ మాత్రులం'' అన్నది వెన్నెల.

ప్రపంచ సామ్రాజ్యాధినేతలు సలాములు పలికారు వెన్నెల రాణికి.

చలనిపిస్తుంటే కిటికీ గాజుషట్టరు క్రిందకు దించాడు రమణమూర్తి. గాలి స్థంభించినట్లనిపించింది. యింక విజయవాడ ఎక్కువ దూరం లేదు. జగ్గయ్యపేట దాటిపోయింది.

నిద్ర తూలుతున్నట్లుంటే వెన్నెల అతని ఒళ్ళో పడుకుంది. ఆమె చేతిలో జేబుగుడ్డ క్రిందపడిపోయింది. తరవాతివ్వచ్చని రమణమూర్తి తీసి తన జేబులో పెట్టుకున్నాడు.

నాలుగున్నర. ఐదు ప్రాంతాల బస్సు విజయవాడవచ్చి చేరింది. ఆమెని లేపి క్రిందకు దిగాడు రమణమూర్తి. బస్సుస్టాండ్ హోటల్లో ముఖం కడిగి, వేడివేడి యిడ్లీలు చెరి•రెండుతిని, వేడి వేడి కాఫీ గొంతుల్లో పోసుకున్నారు.

''ఎక్కడకు వెళ్తారు?'' అడిగాడు రమణమూర్తి.

''తెనాలి''

తెనాలి బస్సుస్టాండులో బస్సు రెడీగా వుంది. యింకా తొలిసంధ్యలో వెన్నెల పేలవంగా నేల మీద పాకుతూనే ఉంది.

''తరువాత బస్సులో పోకూడదూ?'' అన్నాడు రమణమూర్తి.

''యిక్కడింకా వుండి ఏంచేద్దాం?'' వెన్నెల

''దుర్గాదేవిని దర్శించిపోదాం''.

''నేనే కనకదుర్గను'' అని నవ్వింది వెన్నెల.

ఆ విడివడటం ఎంత బలీయమైనదో అర్థమైంది రమణమూర్తికి.

విడిపోయే క్షణం వచ్చింది.

ఆమె ముఖం మ్లానమయింది. అతడికేం మాట్లాడాలో తోచలేదు. డ్రైవరు బస్సు స్టార్టు చేస్తున్నాడు.

''వెళ్తానుమరి'' అని ఆమె అతడిచేతిని పట్టుకునొక్కి బస్సులో ఎక్కి కూర్చుంది.

రమణమూర్తికి అప్పుడు స్ఫురించింది ఆమె పేరు అడగలేదు తను.

''మీ పేరు?'' కదుల్తున్న బస్సురొదలో అడిగాడు.

''వెన్నెల'' నవ్విందామె.

బస్సు ముందుకు సాగింది.

''అడ్రసు'' ముందుకు సాగిన బస్సురొదలో కలిసిపోయింది అతడిగొంతు. బస్సు గేటుదాటి ముందుకు దూసుకుపోయింది. ఆమె వెళ్ళి పోయింది - శాశ్వతంగా వెళ్ళిపోయింది.

ఆమె పేరు వెన్నెలేనా? తన కబద్ధం చెప్పింది. అనుకున్నాడు రమణమూర్తి. సిగరెట్టుకోసం జేబులో పెట్టిన చేతికి ఆమె నిద్రలో వదలిన జేబుగుడ్డ తగిలింది. ఆ రుమాలు బయటకు తీసి ఆమె పేరేమయినా దొరుకుందేమోనని ఆత్రంగా అందులో వెదికాడు. వంగపండు రంగుగుడ్డ చుట్టూ తెల్లనిదారంలో అర్చీలు అర్చీలుగా డిజైను కుట్టివున్నది. ఓమూల చిన్నపిచ్చిగడ్డి మొక్క ఎంబ్రాయిడరీ క్రింద అర్ధచంద్రాకృతిలో 'ఫ్రైడే' అన్న ఇంగ్లీషు అక్షరాలు. అవును నిన్న శుక్రవారమేకదా అనుకున్నాడు రమణమూర్తి.

అతనికి నిరాశ అనిపించింది - మరుక్షణంలో ఉపశమనం. అవును ఆమె పేరు ''వెన్నెలే'' - ''ఇమ్మోర్టలనేమ్'' - అందరి ఆడవాళ్ళకూ వున్నట్టే ఆమెకూ ఏ శశికళో, వసుంధరో, సుజాతో, సులోచనో - ఏదో నశించి పోయే పేరు వుండనే వుంటుంది. కాని యిది అమరనామం. ఈ వెన్నెల సర్వజగత్తూ ప్రకాశిస్తూనే వుంటుంది.

తూర్పురేఖలు ప్రసరిస్తూంటే రైలు స్టేషను వైపుగా సాగిపోయాడు రమణమూర్తి.

'ఆంధ్రజ్యోతి' సచిత్రవారపత్రిక

28-4-1972